ప్రజాశక్తి
శనివారం 30 మార్చి 2024
5
విజయనగరం

ఐపిఎల్ స్కోరర్‌గా తోట విజయ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 31న విశాఖలో జరుగనున్న ఢిల్లీ క్యాపిటల్, కోల్‌కత్తా మధ్య జరుగనున్న ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌కు విజయనగరానికి చెందిన తోట విజయ్ స్కోరర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే విజయ్ 12 వన్ డే, 6 టీ20, 3 టెస్ట్, 13 ఐపిల్ మ్యాచ్‌లకు స్కోరర్‌గా బాధ్యతలు నిర్వహించారు. విజయ్ 450 మ్యాచ్ లకు పైగా అంపైర్ గా కూడా వ్యవహరించారు. 2008లో ఆంధ్ర క్రికెట్‌లో అంపైర్ గా, 2009 లో బిసిసిఐ లెవెల్ 1 అంపైర్ గా, 2012, 2018లో బిసిసిఐ నిర్వహించిన స్కోరింగ్ పరీక్షల్లో ఇండియాలోనే మొదటి స్థానం సాధించడం మన రాష్ట్రానికి, జిల్లాకి ఎంతో గర్వకారణమని అన్నారు.

టిడిపిలో వీడిన ఉత్కంఠ

- చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా కళావెంకటరావు
- విజయనగరం లోక్‌సభకు కలిశెట్టి అప్పలనాయుడు
- కంగుతిన్న నాగార్జున, బంగార్రాజు, మీసాల గీత, చంద్రశేఖర్
- పార్లమెంట్ అధ్యక్ష పదవికి నాగార్జున రాజీనామా
- అధిష్టాన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తెలుగు తమ్ముళ్ల ర్యాలీ, నిరసన
- నెల్లిమర్లలో ఇండిపెండెంట్‌గా పోటీకి బంగార్రాజు సిద్ధం
- అన్ని నియోజకవర్గాల్లోనూ తిరుగుబావుట ఎగురవేస్తున్న నాయకులు

కలిశెట్టి అప్పలనాయుడు

కిమిడి కళావెంకటరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపిలో ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్ల వ్యవహారంపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా కిమిడి కళావెంకటరావును, విజయనగరం లోక్‌సభ అభ్యర్థిగా ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడును పార్టీ అధిష్టానం శుక్రవారం ప్రకటించింది. దీంతో, విజయనగరం జిల్లాలో టిడిపి నుంచి ఎంపి, ఎమ్మెల్యేల టిక్కెట్ల వ్యవహారం కొలిక్కి వచ్చినట్లయింది. కళా వెంకటరావు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం సీటును ఆశించారు. అయితే పొత్తులో భాగంగా ఆ సీటును బిజెపికి కేటాయించడంతో ఆయనకు చీపురుపల్లి అసెంబ్లీ లేదా విజయనగరం పార్లమెంట్ సీటు వస్తుందా రాదా అని ఆ పార్టీ కార్యకర్తలు ఉత్కంఠంగా ఎదురు చూశారు. చివరకు చీపురుపల్లి అసెంబ్లీ సీటును అధిష్టానం కేటాయించింది. గతంలో ఆయన ఉణుకూరు, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. విద్యుత్, హోంశాఖ మంత్రిగా పనిచేశారు. కలిశెట్టి అప్పలనాయుడు టిడిపి ఉత్తరాంధ్ర శిక్షణ శిబిరం డైరెక్టర్‌గా పనిచేశారు. ఈయన కూడా తొలి నుంచీ ఎచ్చెర్ల నియోజకవర్గ సీటును ఆశించారు. చివరకు విజయనగరం ఎంపి అభ్యర్థిగా ఆయనకు అవకాశం లభించింది.

టిడిపి అభ్యర్థుల చివరి జాబితా విడుదల కావడంతో ఇప్పటివరకూ ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు ఆశించిన పలువురు నాయకులు భంగపడ్డారు. వీరిలో చీపురుపల్లి, నెల్లిమర్ల నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు కిమిడి నాగార్జున, విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఉన్నారు. టిక్కెట్ ఇవ్వకపోవడంతో నాగార్జున చీపురుపల్లి అసెంబ్లీ, విజయనగరం పార్లమెంట్ ఇన్‌ఛార్జి పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో తన కార్యాచరణ ప్రకటించనున్నట్టు కూడా చెప్పారు. మరోవైపు నాగార్జునకు మద్ధతు పలుకుతూ 'కళా వద్దు.నాగార్జునే ముద్దు' అంటూ టిడిపి కార్యకర్తలు చీపురుపల్లిలో ర్యాలీ నిర్వహించారు. నాగార్జున క్యాంపు కార్యాలయం ముందు కూడా పార్టీ కరపత్రాలను తగలబెట్టి నిరసన తెలిపారు. దీంతో, ఈ నియోజకవర్గంలో టిడిపిలోని అంతర్గత రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

జనసేన పొత్తులో భాగంగా నెల్లిమర్ల నియోకవర్గం సీటు కోల్పోయిన కర్రోతు బంగార్రాజుకు భీమిలి సీటు ఇస్తారంటూ పార్టీలో ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఐవిఆర్ఎస్ సర్వే కూడా చేపట్టారు. చివరకు ఆ సీటు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు కేటాయించడంతో కర్రోతు ఆశలు అడియాశలయ్యాయి. ఈనేపథ్యంలో ఆయన ఇండిపెండింట్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మాజీ ఎమ్మెల్యే మీసాల గీతపేరును చీపురుపల్లి అసెంబ్లీ, విజయనగరం ఎంపీ అభ్యర్థిత్వానికి కూడా పార్టీ ఐవిఆర్ఎస్ నిర్వహించింది. దీంతో, గీతకు ఈ రెండింటిలో ఏదో ఒక సీటు ఖాయమంటూ చర్చ నడించింది. ఆచరణలో అటువంటిదేమీ లేకపోవడంతో ఆమెతో తన అనుయాయులు ఖంగుతిన్నారు. ఎంపీ అభ్యర్థిగా డెంకాడ ఎంపిపి కంది చంద్రశేఖర్ పేరు కూడా పరిశీలనకు వెళ్లినప్పటికీ చివరి క్షణాల్లో తిరస్కరణకు గురైంది.

ఎస్.కోట నుంచి ఎమ్మెల్యే సీటు ఆశించి నాలుగు రోజుల క్రితమే భంగపడ్డ గొంప కృష్ణ, అధిష్టానంతో జరిగిన చర్చల తరువాత కూడా వెనక్కి తగ్గలేదు. కార్యకర్తలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటిస్తామంటూ పార్టీకి హెచ్చరించారు. మరోవైపు గజపతినగరంలో సీటు కోల్పోయిన కెఎ నాయుడు, ప్రస్తుత అభ్యర్థి అభ్యర్థి శ్రీనివాసరావుకు సహకరించే పరిస్థితే లేదంటూ తేల్చిచెప్తున్నారు. రాజాంలో మాజీ స్పీకర్ ప్రతిభాభారతితోపాటు ఆయన అనుయాయులు కూడా ఇంకా కోండ్రు మురళితో కలిసి నడవడం లేదు. మురళి కూడా బుజ్జగింపు ప్రయత్నాలు చేయడం లేదు. దీంతో, ఇక్కడి తెలుగు తమ్ముళ్ల వ్యవహారం ఇప్పట్లో తేలేటట్టు కనిపించడం లేదు. విజయనగరం అభ్యర్థి అదితి విజయలక్ష్మితో మాజీ ఎమ్మెల్యే మీసాల గీత కలిసి వెళ్లడం లేదు. ఇలా తొలి నుంచీ టిక్కెట్ కోసం ఎంతో ఆశగా ఎదురుచూసి భంగపడ్డవారంతా అధిష్టానం నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఎస్.కోట, చీపురుపల్లిలో రాజీనామాలతోపాటు పార్టీపై తిరుగుబావుట ఎగరవేస్తుండగా, మిగిలిన చోట్ల గుంభనంగా ఉన్నారు. పరిణామాలు ఎలా దారితీస్తాయో కొద్దిరోజులు వేచిచూడాల్సిందే.

పార్టీ పదవులకు కిమిడి రాజీనామా

అధిష్టాన నిర్ణయానికి వ్యతిరేకంగా ర్యాలీ

అధిష్టానానికి వ్యతిరేకంగా చీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-చీపురుపల్లి

తనకు చీపురుపల్లి అసెంబ్లీ టిక్కెట్ కేటాయించ నందుకు నిరసనగా టిడిపి విజయ నగరం పార్లమెంటు స్థానం అధ్యక్ష పదవికి, చీపురుపల్లి నియోజకవర్గ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు కిమిడి నాగార్జున ప్రకటించారు. శుక్రవారం తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం విడుదల చేసిన అభ్యర్థుల ఆఖరి జాబితాలో తన పేరు లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా పార్టీ కోసం కార్యకర్తల కోసం నిరంతర శ్రామికుడిలా పని చేశానన్నారు. అయితే పార్టీ తనను కాదని వేరొకరికి పార్టీ టిక్కెట్ కేటాయించడం బాధాకరమైన విషమన్నారు. కష్టపడి పనిచేస్తే పార్టీ తనకు టిక్కెట్ ఇవ్వకుండా క్షవరం చేసిందన్నారు. తన భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానని నాగార్జున తెలిపారు.

నాగార్జున వెంటే మేము కూడా

నాగార్జున బాటలోనే తాము కూడా నడుస్తామని టిడిపి చీపురుపల్లి మండల అధ్యక్షుడు రౌతు కాము నాయుడు, తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పైల బలరాం తెలిపారు. వెన్నంటే ఉండి ఐదేళ్ల పాటు తమని నడిపించిన నాగార్జునకు టిడిపి రాష్ట్ర పార్టీ అన్యాయం చేయడం మంచి పద్దతి కాదని అన్నారు. అనంతరం కళా వెంకటరావుకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ టిడిపి కార్యకర్తలు, నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ర్యాలీలో రౌతు కాము నాయుడు, పైల బలరాం, తాడ్డి సన్యాసి నాయుడు, ముల్లు రమణ, సారిపాక సురేష్ పాల్గొన్నారు.

పునరాలోచించకుంటే స్వతంత్రంగా పోటీ : బంగార్రాజు

సమావేశంలో మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం : టిక్కెట్ల కేటాయింపు విషయంలో పార్టీ పునరాలోచించుకొని రెండు మూడు రోజుల్లో న్యాయం చేయకపోతే ఇండిపెండెంట్ పోటీ చేస్తానని కర్రోతు బంగార్రాజు ప్రకటించారు. పార్టీ అధిష్టానం శుక్రవారం విడుదల చేసిన జాబితాలో ఆయనకు పార్టీ ఎక్కడా టికెట్ ఇవ్వకపోవడంతో పోలిపల్లిలోని ఆయన స్వగహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితంగా గెలిచి తీరుతామన్న టికెట్‌ను పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయించారని, తర్వాత అధిష్టానం భీమిలి లేదా చీపురుపల్లిలో అవకాశం ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. కార్యకర్తలు, నాయకులు ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఒత్తిడి చేస్తున్నందున పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. టిడిపి భోగాపురం మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, నెల్లిమర్ల మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, సువ్వాడ రవిశేఖర్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన బంగార్రాజుకే ఇంత అన్యాయం జరిగితే మిగతావారు ఎలా కష్టపడతారని ప్రశ్నించారు. గేదెల రాజారావు, మాజీ జడ్పీటీసీ ఆకిరి ప్రసాద్, పూసపాటిరేగ మండలం నాయకులు దంగా భూలోకం, మైలపల్లి సింహాచలం, పూసపాటి సన్యాసి నాయుడు, ఇజ్జరోతు ఈశ్వరరావు మాట్లాడుతూ బంగార్రాజు ఏ నిర్ణయం తీసుకున్న దానికి కట్టుబడి ఉంటామని అన్నారు.

ఘటనా స్థలంలో షణ్ముఖరావు మృతదేహం

పెళ్లికార్డులు పంచేందుకు వెళ్తూ వరుడు మృతి

ప్రజాశక్తి-రేగిడి

వివాహం చేసుకొని పిల్లాపాపలతో సుఖ జీవనం గడపాలని ఆశించిన ఆ పెళ్లి కుమారుడి ఆశలు ఆవిరయ్యాయి. ఏప్రిల్ 20న వివాహం చేసుకొనేందుకు ముహూర్తం ఖరారు చేశారు. పెళ్లి కార్డులు బంధువులకు పంచుతుండగా ఆటో రూపంలో మృత్యువు కాటేసింది. రేగిడి మండలం లచ్చారాయపురం వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్న సంఘటనలో పాతపట్నం మండలం కోయికొండ గ్రామానికి చెందిన యువకుడు షణ్ముఖరావు అక్కడికక్కడే మృతి చెందారు. అతని బంధువుకు తీవ్ర గాయాలయ్యాయి. ఏప్రిల్ 20న షణ్ముఖరావుకు టెక్కలికి చెందిన వధువుతో వివాహం కుదిరింది. ఈ వివాహానికి సంబంధించి కార్డులు పంచేందుకు ద్విచక్ర వాహనంపై షణ్ముఖరావు అతని బంధువు కలిసి బయలుదేరి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పెళ్లి కార్డులు పంచుతూ లచ్చారాయపురం గ్రామం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొని డ్రైవింగ్ చేస్తున్న షణ్ముఖరావు మృత్యువాత పడ్డాడు. అతని బంధువుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనతో కుటుంబంలో విషాదం అలముకుంది. పోస్టుమార్టం అనంతరం బంధువులకి మతదేహాన్ని అప్పగించారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భానుడు భగభగ

- 38 డిగ్రీలకు చేరుకున్న ఎండలు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు

నిర్మానుష్యంగా ఉన్న కలెక్టరేట్ ప్రాంతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో భానుడు భగభగ లాడుతున్నాడు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. అత్యధికంగా 36 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. మార్చి నెల ముగుస్తుండటంతో వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఫిబ్రవరి రెండో వారం నుంచి భగభగలాడుతున్న సూర్యుడు మార్చి ఆరంభం నాటికి తన ప్రతాపాన్ని పెంచాడు. వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది కూడా 38 డిగ్రీలకు చేరుకుంది. విజయనగరంలో శుక్రవారం అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 37 డిగ్రీలు, 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం వెనుకాడుతున్న పరిస్థితి ఏర్పడింది. నగరంలోని కోట కూడలి, కలెక్టరేట్, గంటస్తంభం, ఆర్టీసి కాంప్లెక్స్, మూడు లాంతర్లు ప్రాంతాలు మధ్యాహ్నం నిర్మానుష్యంగా కనిపించాయి. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల, షాపులు కింద నీడను ఆశ్రయిస్తూ కనిపించారు.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బతగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీపెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

మిమ్స్ ఉద్యోగుల చర్చలు వాయిదా

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తమ సమస్యలు పరిష్కరించాలని మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు స్థానిక ఆర్ఒబి వద్ద చేస్తున్న నిరసన పోరాటం శుక్రవారం 58వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రెండు రోజులుగా జరుగుతున్న చర్చలు సోమవారానికి వాయిదా పడ్డాయి. ఈ సందర్భంగా మిమ్స్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ శిబిరంలో మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం 7 శాతం డిఎ ఇవ్వడానికి అంగీకారం తెలిపిందన్నారు. వేతన ఒప్పందం కొత్త నిబంధనల ప్రకారం చేస్తామని, అది కూడా ఏప్రిల్ నుంచి ఇస్తూ ఆగస్టులో ఒప్పందం చేస్తానని చెప్పడం భావ్యం కాదన్నారు. ముందు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్‌చేశారు. కొత్త వేతన ఒప్పందం ప్రకారం పెరిగిన వేతనాలు ఆగస్టు నుంచి అమలు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు, కార్మికులకు పోరాట కాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. యూనియన్ ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్ వద్ద అగ్రిమెంట్ చేయాలని ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారని తెలిపారు. శిబిరంలో మిమ్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణ, ఉద్యోగులు కె.కాము నాయుడు, కె.మధు, ఎం.నాగభూషణం, గౌరీ, వరలక్ష్మి, బి.బంగారునాయుడు, మూర్తి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


విజయనగరంలో టిడిపి జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అశోక్, నాయకులు

యువత భవిష్యత్తు నాశనం

టిడిపి ఆవిర్భావ దినోత్సవంలో అశోక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలోకి డ్రగ్స్ , గంజాయి తీసుకొచ్చి యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద మాజీమంత్రి పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అశోక్‌బంగ్లాలో పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా మట్లాడుతూ ఎన్టీఆర్ లాంటి త్యాగమూర్తి పెట్టిన టిడిపి 42 ఏళ్ళు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు తెచ్చి పేద ప్రజలకు అండగా ఉన్నది ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు అన్నారు. నేడు రాష్ట్రంలో ఆ పరిస్థితి కనబడడం లేదన్నారు. విధ్వంసం, దోపిడీ, అరెస్టులు ఇవ్వే కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులు బ్రోకర్లు లాగా తయారయ్యారని విమర్శించారు. ప్రజాధనాన్ని దోచుకుంటూ పేదలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. విజయనగరంలో ఒలింపిక్ క్రీడాకారుడిలా స్థానిక ప్రజాప్రతినిధి జల ఆసనాలు వేసి ఊరంతా బ్యానర్లు కట్టుకున్నాడన్నారు. ఆయన విన్యాసాలు చూడడానికి మంత్రులు, స్పీకర్ రావడం మరో విడ్డూరమన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం దగ్గర మన హక్కులు గురించి అడిగే దమ్ము వైసిపి ఎంపిలకు లేదన్నారు. రాష్ట్రంలో అన్నిటినీ తాకట్టు పెట్టడమే పనిగా పెట్టుకుని ఒక సర్కస్ కంపెనీలాగా తయారుచేశారన్నారు. రాష్ట్రంలో సైకో పాలన పోయే సమయం వచ్చిందన్నారు. మళ్లీ జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

విజయనగరం నియోజకవర్గ ఇంచార్జి అదితి విజయలక్ష్మి గజపతి మాట్లాడుతూ ప్రజలందరూ నాకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన టిడిపి కార్యకర్త పప్పు సంతోష్ పిల్లలు చదువు నిమిత్తం రూ.25వేలు ఆర్థిక సాయాన్ని అదితి గజపతి అందజేశారు.అనంతరం వివిధ రంగాలలో విశేష సేవలందించిన వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సునీలా గజపతిరాజు, ఐవిపి రాజు, రాజేష్ బాబు, ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, బంగారు బాబు, బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్ , గాడు అప్పారావు , కర్రోతు నర్సింగరావు , కనకల మురళీమోహన్, కంది మురళి నాయుడు, విజ్జపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలో టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యాన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం క్లస్టర్ స్థాయి, జయహో బిసి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎన్ని పథకాలు వచ్చినా సంతృప్తిగా లేరన్నారు. వారి జీవన విధానం మెరుగుపడినప్పుడు నిజమైన సంతృప్తి వస్తుందన్నారు. అందరి జీవితాలలో వెలుగు నింపాలంటే అది చంద్రబాబుకి మాత్రమే సాధ్యమని చెప్పారు. సమావేశంలో జనసేన పిఎసి సభ్యులు పడాల అరుణ, నాయకులు మర్రాపు సురేష్, మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, టిడిపి సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, టిడిపి దత్తిరాజేరు మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, జామి మండల అధ్యక్షులు పి.స్వామినాయుడు, జనసేన నాయకులు జగన్, అప్పలరాజు, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలో టిడిపి కార్యాలయంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు సీనియర్ నాయకులు మల్లేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోష్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : టిడిపితోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా అన్నారు. కోటలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం టిడిపి జెండాను ఎగురవేశారు.


గజపతినగరం.. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న శ్రీనివాస్

ఎం.శ్రీనివాస దంపతులను సన్మానిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

శ్రీనివాస సేవలు స్ఫూర్తిదాయకం

ఉద్యోగ విరమణ సన్మానసభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఎల్ఐసి యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస అందించిన సేవలు స్ఫూర్తి దాయకమైనవని ఎల్ఐసి ఉద్యోగ సంఘాల నాయకులు, పలు ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. ఎల్ఐసి విజయనగరం బ్రాంచిలో అసిస్టెంట్‌గా ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ చేసిన ఎం.శ్రీనివాస అభినందన సభ శుక్రవారం స్థానిక రెవెన్యూ హోంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలిండియా ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ మాజీకార్యదర్శి కె.వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకునేందుకు జరిగే ఉద్యమాల్లోను, కార్మిక పోరాటాల్లోనూ శ్రీనివాస తనవంతు కృషి చేశారని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఎల్ఐసి యూనియన్, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఎల్ఐసి ఉద్యోగిగా, కార్మికసంఘం నాయకుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు పీడిత, శ్రామిక వర్గ ప్రజలు కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. రిటైర్మెంట్ అనంతరం మరింత సమయం కేటాయించి పేద, బడుగు బలహీన వర్గాల కోసం పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు, ఏజెంట్ల సంఘం నాయకులు, అధికారులు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస, శశికళ దంపతులను ఘనంగా సన్మానించారు.

టిడిపిది నీచ రాజకీయం : ఎంపిపి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

టిడిపి నీచ రాజకీయాలకు పాల్పడుతోందని ఎంపిపి గేదెల శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఎంపిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన వద్ద ఎన్నికల డబ్బు ఉందంటూ తప్పుడు ఫిర్యాదు అందడంతో విశాఖ ఈస్ట్ పాయింట్ కాలనీలోని నివాసంలో గురువారం రాత్రి పోలీసులు చొరబడి దాచుకున్న డబ్బు రూ.5 లక్షలను తీసుకెళ్లిపోయారని తెలిపారు. తమ మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఇంట్లో చొరబడి భయాందోళనకు గురి చేసి సినీ ఫక్కీలో సోదాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బ్యాంకు నుంచి విత్‌డ్రా చేశానని వివరాలు చూపించినా బలవంతంగా పోలీసులు నగదును పట్టుకుపోయారని మీడియాకు వెల్లడించారు. తాను రాజకీయ నాయకుడినే కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తనని, 26 ఎకరాలలో మామిడి తోటలు ఉన్నందున వాటి ద్వారా వచ్చిన డబ్బును ఇంట్లో దాచుకోవడం నేరమా? అని ప్రశ్నించారు. తమపై తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.5 లక్షలు తిరిగి ఇవ్వాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న గొంప క్రిష్ణ

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని రేవళ్లపాలెంలో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో చిటికిరెడ్డి అర్జునరావు ఇల్లు పూర్తిగా కాలి బూడిదైన విషయం తెలిసిందే. శుక్రవారం యువనేత గొంప క్రిష్ణ అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. అనంతరం అర్జునరావుకు రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాయవరపు చంద్రశేఖర్, కొట్యాడ లోకాభి రామకోటి, జుత్తాడ రామసత్యం, ఆడారి రమేష్, మాదిబోయిన మంగరాజు, ఆడారి ఉమామహేశ్వరావు, గనివాడ సన్యాసినాయుడు, మతల ఎర్రినాయుడు, అప్పలసత్యం, కిలపర్తి హరి, మోపాడ అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఉపాధి పనులు చేసి ఆరు వారాలుగా పెండింగ్ ఉన్న కూలీలకు బిల్లులు వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు అన్ని విధాలా అండగా ఉంటున్న వారి సమస్యలపై పోరాటం చేస్తున్న ఎర్ర జెండా నాయకత్వంలో ఎవరైతే ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేస్తున్నారో వారికే మీ ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం ఉపాధి పనులు చేసే కూలీలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఆరువారాలుగా ఎండనక, వాననక అనేక ఇబ్బందులు పడుతూ రెండు పూటలా ఉపాధి పని చేస్తున్న కూలీలకు పనిచేసిన 14 రోజులకే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉన్నప్పుడు గడిచిన ఆరు నెలలుగా ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో పేదలు ఆర్థిక ఇబ్బందులతో ఇతర జిల్లాలకు ఇతర రాష్ట్రాలకు పెసర, మినప మొక్కల తీత, ఇతర పనులకు వలసలు వెళ్తుంటే ఇక్కడ జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోకపోవడం చాలా అన్యాయమని తెలిపారు. ఉపాధి పనులు చేసే చోట టెంట్లు, మంచినీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు గానీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినా పనులు చేసినా నేటికీ వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 8వారాల పెండింగ్ బిల్లులు చెల్లించేలా జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిచో ఉపాధి హామీ కూలీలతో కలిసి ఏప్రిల్ మొదటి వారంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

లోకం మాధవి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని చొల్లంగిపేట, డి.కొల్లాం పంచాయతీల్లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పతివాడ అప్పలనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా'

ప్రజాశక్తి- విజయనగరం కోట

విజయనగరం అసెంబ్లీ లేదా పార్లమెంట్ సీటును ఆశించి భంగపడిన బిజెపి నాయకులు కుసుమంచి సుబ్బారావు ఇండిపెండెంట్‌గా పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో పార్టీ నాయకులు ఎవరికి వారు యమునా తీరు అనే చందంగా ఉన్నారని తెలిపారు. అధిష్టానానికి ఎన్నిసార్లు విన్నవించుకున్న స్పష్టమైన హామీ ఇవ్వకుండా దాటవేయడం బాధాకరమన్నారు. పార్టీకి 35ఏళ్లగా సేవలందిస్తున్నా తనను గుర్తించలేదన్నారు. ఈనేపథ్యంలో స్వతంత్రంగా పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

ఆశీలు కట్టాల్సిందే..

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ పరిధిలోకి వాణిజ్యపరమైన సరుకులను తీసుకొచ్చే ఎలాంటి వాహనదారులైనా మున్సిపల్ కార్యాలయం ద్వారా నియమించబడే సిబ్బందికి ఆశీలు చెల్లించాల్సిందేనని మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారి రూబేను దిబ్బా అన్నారు. శుక్రవారం పట్టణ శివారులో మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న గ్రోమోర్ ఎరువుల దుకాణానికి 8 లారీలతో గ్రోమోర్ ఎరువులు రావడంతో ఆసీలు చెల్లించాలని మున్సిపల్ రెవిమ్యో విభాగం అధికారులు, సిబ్బంది డిమాండ్ చేయగా, సంబంధిత లారీ డ్రైవర్లు, గ్రోమోర్ ఎరువుల దుకాణం సిబ్బంది ఆశీలు చెల్లించమని మొండికేయడంతో గతంలో ఆశీలు వేలం పాట ప్రైవేటు వ్యక్తులు పాడి వసూలు చేసే వాళ్లని, వేలం పాట వాయిదా పడడంతో, మున్సిపల్ రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో ఆసీలు వసూలు చేయడం జరుగుతుందనిలారీ డ్రైవర్లకు చెప్పడంతో, ఇరువురి మధ్య కొంత వాగ్వివాదం జరిగింది. అనంతరం మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఆసీలు చెల్లించినదే ఎరువులను దించడం జరగదని చెప్పడంతో గ్రోమోర్ ఎరువుల దుకాణం మేనేజర్ యాజమాన్యానికి సమాచారం తెలపడంతో, ఎట్టకేలకు ఆసీలు చెల్లింపులు జరిగాయి. ఆశీలు వసూళ్లలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పి. నారాయణరావు, జి.వినయ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయగడ జమ్ములో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రాయగడజమ్ములో శుక్రవారం నాబార్డ్ జీవ - జట్టు సంస్థ - పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్య అధికారి డాక్టర్ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఎండలు ఉధృతంగా ఉన్నందున మూగజీవులైన పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లను సురక్షితంగా చూసుకోవాల్సిన బాధ్యత పెంపకం దారులపై ఉందని, నీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు పశుపక్షాదులకు సంరక్షణ విషయంలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, వ్యవసాయరంగ కార్యకలాపాలతో పాటు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మానవుల అభివృద్ధి కచ్చితంగా చెందడం జరుగుతుందని అన్నారు. పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధులు సోకిన పశువులకు టీకాలు వేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.ప్రబోద్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో ఏజెన్సీ ప్రాంతంలో గల పోలింగ్ కేంద్రాలు చిట్యాలబా, కన్నయ్యవలస, బొర్ర మామిడి, మిలియా కంచూరు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సాలూరు రూరల్ సిఐ జి.బాలకృష్ణ, స్థానిక ఎస్సై పి.నారాయణరావు సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గిరిజనులకు ఎన్నికల నియమనిబంధనలు, మద్యం సైబర్ నేరాలు వాహనాల ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

హవ్వా! నవ్విపోదురుగాక

- ఇసుక అక్రమ రవాణా ఒకచోట.. ట్రెంచ్‌లు వేరొక చోట
- రెవెన్యూ అధికారుల నిర్వాకమిది
- వైసిపి నాయకుడికి సహకరిస్తున్న వైనం!

గడబవలస నాగావళి వద్ద ట్రెంచ్ ఏర్పాటు చేయని అధికారులు

కొమిరి నాగావళి వద్ద ఇసుక రవాణా లేని చోట ఏర్పాటుచేసిన ట్రెంచ్

ప్రజాశక్తి-రేగిడి

రోగమొకటి అయితే.. మందు మరొకటి ఇచ్చిన చందంగా ఉంది అధికారుల తీరు. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతుంటే, అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వదిలేశారు. దీనిపై పత్రికలో కథనం రావడంతో మరోదారి లేక తూతూ మంత్రంగా తనిఖీలు చేశారు. తీరా అక్రమానికి అడ్డుకట్ట వేయాల్సిన సమయంలో 'అధికార'ం అడ్డు కనిపించినట్లుంది. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న చోట ట్రెంచ్‌లు తవ్వడం మానేశారు. మరోచోట ట్రెంచ్‌లు తవ్వి చేతులు దులుపుకున్నారు. దీంతో అధికారుల తీరుపై మండల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

మండలంలోని రేగిడి, ఖండ్యాం పంచాయతీ పరిధి కొమిరి, వెంకటాపురం వద్ద నాగావళి నదిలో అక్రమ ఇసుక రవాణాపై 'ప్రజాశక్తి'లో ఇటీవల కథనం రావడంతో రెవెన్యూ అధికారులు దాడులు చేపట్టారు. గడబవలస నాగావళి నది వద్ద నుంచి వందలాది ట్రాక్టర్లు, లారీలతో ఇసుక అక్రమ రవాణా సాగడాన్ని ప్రజాశక్తి వెలుగులోకి తెచ్చింది. ఆర్‌డిఒ శాంతి, మైన్స్ అధికారులు దాడులు చేపట్టారు. కొమిరి సమీపంలో నాగావళి నది వద్ద ఇసుక అక్రమ రవాణా కాకుండా ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు.. అయితే వెంకటాపురం సమీప గ్రామమైన గడబవలస వద్ద పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినప్పటికీ ఇక్కడ రెవెన్యూ అధికారులు ట్రెంచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాలో స్థానిక వైసిపి నేత హస్తం ఉందని, ఆయన కనుసన్నల్లో ఇసుక దందా సాగుతోందనే ప్రచారం ఉంది. అయినా, ఆ ప్రాంతంలో ట్రెంచ్‌లు తీయకపోవడం ఏమిటని పలు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. కొమిరి నాగావళి నది నుంచి ఇసుక రవాణా లేని చోట ట్రెంచ్‌లు ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. రేగిడి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నాగావళి నది నుంచి రేయింబవళ్లు ఇసుక అక్రమ రవాణా సాగేది. రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించిన నేపథ్యంలో రెండు రోజులు రవాణా నిలుపుదల చేశారు. అనంతరం ఇసుక దందాను మళ్లీ ప్రారంభించారు. అక్రమంగా ఇసుకను వివిధ పట్టణాలకు తరలిస్తున్నారు. రేగిడి, గడబవలస వద్ద నాగావళి నది తీరంలో ట్రెంచులను తీయకపోవడంతో రెవెన్యూ అధికారుల తీరుపై పలువురు అనుమానాలు వ్యక్తంచేశారు. అధికార పార్టీ నాయకులకు లోబడి రెవెన్యూ అధికారులు పనిచేస్తున్నారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి గడబవలస, రేగిడి నాగావళి నది వద్ద అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు ట్రెంచులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కోలగట్ల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 6వ డివిజన్ సిఆర్ కాలనీ, ఆనంద నగర్ కాలనీల్లో వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేనకు చెందిన పలువురు వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆరవ డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్య కుమారి మాట్లాడుతూ వీరభద్ర స్వామి గెలుపు ప్రజలకు ఎంతో అవసరమని అన్నారు. నిత్యం నియోజకవర్గ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆయన కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్చార్జిలు బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, రెడ్డి గురుమూర్తి, ఐదో డివిజన్ కార్పొరేటర్ గాదం మురళి, వైసీపీ నాయకులు కెవిపి రాజు, ఆల్తి శ్రీనివాసరావు, చిన్ని కృష్ణ, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

మైక్ లైటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతు

కోలగట్ల వీరభద్ర స్వామికి మైక్ అండ్ లైటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మద్దతు ప్రకటించారు. కోలగట్ల నివాసంలో అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. పూలమాలలతో సత్కరించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు గాడు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఐదేళ్లలో శాసనసభ్యునిగా కోలగట్ల వీరభద్ర స్వామి నగరాభివృద్ధికి ఎంతగానో కృషి చేసారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బిలాయిరాజు, కార్యదర్శి చిన్నరావు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యేకు హారతులిస్తున్న మహిళలు

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గత ఐదేళ్లలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శుక్రవారం మండలంలోని బొడ్డవర గ్రామంలో ఎన్నికల ప్రచారానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్నానని, మరోసారి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఐదేళ్లపాటు అవినీతి రహిత పాలన అందించినట్లు చెప్పారు. వైసిపి హయాంలో సంక్షేమ పథకాల అమలు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫోక్, కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, పోతనపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి వాకాడ సతీష్, ఎంపిటిసి సన్యాసప్పడు, తలారి అనంత్, సీతంపేట నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-మెంటాడ

వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి కోరారు. శుక్రవారం మెంటాడ మండలంలోని కంటుభుక్తవలస గ్రామ శివారులో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆమె ఎగురవేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి అవలంబిస్తున్న అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని కార్యకర్తలను దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్ దేవ్, టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, సీనియర్ నేతలు గెద్ద అన్నవరం, గొర్లె ముసలినాయుడు, పల్లి సింహాద్రి నాయుడు, జనసేన నేతలు రాజశేఖర్, విష్ణువర్ధన్, శివశంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన గ్రహణం వీడాలి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-కొత్తవలస

రాష్ట్రానికి పట్టిన గ్రహణం విగ్రహణం వీడి అభివృద్ధి జరగాలని ఎస్ కోట నియోజకవర్గం టిడిపి అభ్యర్థిని కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలో కాటకాపల్లి, చినరావుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన గ్రహణం వీడాలని, చంద్రబాబు నాయుడు పాలన రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. బాబు రూపకల్పన చేసిన సూపర్ సిక్స్ పథకాలు, బిసి డిక్లరేషన్‌పై వివరించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచెయ్యడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి కోళ్ల లలిత కుమారి

కార్యక్రమంలో కాటకా పల్లి మాజీ సర్పంచ్ రెడ్డి పైడినాయుడు, చినరావుపల్లి మాజీ సర్పంచ్ బొబ్బిలి రమణ, కోళ్ల శ్రీను, బొబ్బిలి అప్పారావు మాస్టారు, రత్నాజీ, నాయకులు పాల్గొన్నారు.

కొప్పల వెలమకు ప్రాధాన్యత ఇవ్వాలి

రాష్ట్ర అధ్యక్షులు తిరుపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో కొప్పల వెలమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యతను కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మనాయిని తిరుపతిరావు నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రదీప్ నగర్‌లో గల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొప్పల వెలమ సామాజిక వర్గానికి ఎన్నికల్లో టికెట్ కేటాయించకపోవడం తమ సామాజిక వర్గానికి తీవ్ర అసంతృప్తిని మిగిల్చిందని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన తమ సామాజిక వర్గానికి జిల్లాలోని గజపతినగరం అసెంబ్లీ స్థానాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. మన్యం జిల్లాలో కూడా కొప్పల వెలమ సామాజిక వర్గం బలంగా అత్యధిక ఓటు బ్యాంకును కలిగి ఉందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల పేరుతో పార్వతీపురం జిల్లాలో స్థానాలు తమకు దక్కలేదని విజయనగరంలో కూడా తమకు ఏ రాజకీయ పార్టీ టిక్కెట్లును కేటాయించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సంఘ రాష్ట్ర నాయకుడు మరిశర్ల కష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అగ్రకులాలకే పెద్ద పీట వేసిందని, బీసీలకు ముఖ్యంగా కొప్పల వెలమకు ఎక్కడా స్థానం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో విజయనగరం పార్లమెంటు స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తామన్నారు. సమావేశంలో మెంటాడ మండల నాయకుడు బోని చంద్రి నాయుడు, గజపతినగరం నియోజకవర్గ అధ్యక్షుడు దొగ్గ దేవుడు బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనాయుడు, మరిచర్ల కష్ణమూర్తి నాయుడు, జాగరపు ఈశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో కుంటుపడిన అభివృద్ధి



మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి హయాంలో అభివృద్ధి కుంటుపడిందని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక బిజెపి కార్యాలయంలో బేబినాయన పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బేబినాయనను అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బేబినాయనతో సాధ్యమన్నారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే పట్టణ, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం పట్టణంలోని 29వ వార్డులో బేబినాయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. మసీదులో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, బిజెపి నాయకులు పి.జగదీష్, కె.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్ఒ సాయిశ్రీ

ఓటు హక్కు వజ్రాయుధం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఓటు హక్కు వజ్రాయుధమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు పట్టణంలో శుక్రవారం 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటుహక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఏప్రిల్ 15లోగా దరఖాస్తు చేసుకుని ఓటుహక్కు పొందాలన్నారు. ఓటుహక్కును వినియోగించుకుని మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహాశీల్దార్ త్రినాథరావు నాయుడు, రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, కోశాధికారి శ్రీనివాస్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

బొబ్బిలి.. చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే ఘనంగా జరిగింది. పట్టణంలో క్రైస్తవులు యేసు శిలువను ఊరేగించారు. అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్‌సిఎం చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పాల్గొన్నారు. క్రైస్తవులకు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు చెప్పారు.

వేపాడ : మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేపాడ, గుడిపాల, బల్లంకి, మైచర్ల సింగవరం, వీలుపర్తి, సోంపురం తదితర గ్రామాల్లో చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

క్రీడా పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని దేవుదళ కెజిబివి, సంకిలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ఇఐడి ప్యారి సుగర్స్ యాజమాన్యం, రమాదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా క్రీడ పరికరాలను శుక్రవారం అందజేశాయి. క్రికెట్, వాలీబాల్, షటిల్, ఫుట్‌బాల్, చెస్, బ్యాడ్మింటన్ వంటి క్రీడా పరికరాల కిట్లను సర్పంచులు దుర్గమ్మ గవరయ్య, బుడుమూరు పట్టాభి, ఎంపిటిసి మజ్జి సంధ్యా శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఇఐడి ప్యారి సుగర్స్ అసోసియేట్ ఉపాధ్యక్షులు పట్టాభిరామిరెడ్డి, హెచ్‌ఆర్ హెడ్ మేనేజర్ మురళీకృష్ణ, రమాదేవి ఫౌండేషన్ అధినేత రమాదేవి మాట్లాడుతూ తమ సంస్థల ద్వారా పేద విద్యార్థులను ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలతో పాటు క్రీడా పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ లక్ష్మి, ధార రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీస్ కవాత్తు

ప్రజాశక్తి-వేపాడ

ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అరిగిపాలెం, సోంపురం, పాటూరు, బొద్దాం గ్రామాల్లో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శృంగవరపుకోట సిఐ, వల్లంపూడి ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గిరిజనాభివృద్ధికి కట్టుబడిన ప్రభుత్వం

ప్రజాశక్తి-బాడంగి

తమ ప్రభుత్వం గిరిజనాభివృద్ధికి కట్టుబడి ఉందని జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, వైసిపి నాయకులు తెంటు మధుసూదన్ తెలిపారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు బొబ్బిలి మండలంలో ప్రచారంలో భాగంగా గిరిజన మహిళ గురించి చేసిన వ్యాఖ్యలను గజరాయనివలస ఎంపిటిసి పాలవలస గౌరు వక్రీకరించడం సరికాదన్నారు. గిరిజన సంప్రదాయం, జీవనశైలిలో మార్పులు వచ్చాయనే ఉద్దేశంతో ఎమ్మెల్యే శంబంగి మాట్లాడారే తప్ప ఎక్కడా కించపరచలేదని చెప్పారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రోడ్లు వేయడంతోపాటు తాగునీరు అందించామని తెలిపారు. ఇకనైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవుపలికారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.భాస్కర్ రావు, తెంటు సింహాచలం పాల్గొన్నారు.

బెల్లంఊట ధ్వంసం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని నీలకంఠాపురం గ్రామ శివారులో సారా తయారు చేసేందుకు రహస్యంగా దాచిపెట్టిన 250 లీటర్ల బెల్లపు ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు దాడులు చేశామని ఎస్ఐ గోపాలరావు తెలిపారు. ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.